క్లుప్తంగా

మట్టి నాణ్యతే ప్రధానం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

శ్రీకాకుళం రూరల్: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే మట్టి నాణ్యతే ప్రధానమని జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి అన్నారు. ప్రపంచ మట్టి దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం రూరల్ మండలం లంకాం గ్రామంలో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ యాజమాన్యం, సంరక్షణను రైతులకు వివరించారు. వ్యవసాయ సహాయ సంచాలకుడు భవానీ శంకర్ రైతులకు మట్టి నమూనాల సేకరించడం, పోషకాల ఆవశ్యకత తెలియజేశారు. అనంతరం ఖరీఫ్‌లో సేకరించిన మట్టి ఫలితాల కార్డులను అందజేశారు. కార్యక్రమంలో అధికారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న రవికుమార్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణ అభివృద్ధి సంస్థ (సుడా) అధ్యక్షుడిగా కొరికాన రవి కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. సుడాను అత్యంత పారదర్శకంగా తీర్చిదిద్దుతానని తెలియజేశారు. కార్యక్రమంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భూసారంతోనే మెరుగైన పంటలు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: భూసారంతోనే మెరుగైన పంటలు, దిగుబడులు సాధ్యమవుతాయని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో సంతసీతారాంపురంలోని స్కై వ్యవసాయ కళాశాలలో ప్రపంచ మృత్తిక దినోత్సవం గురువారం నిర్వహించారు. ఆహారం సమృద్ధిగా లభిస్తేనే సమాజ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. వ్యవసాయంపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. రైతులు సేంద్రీయ సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ రేవతి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం



సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని ఫార్మసీ ప్రిన్సిపాల్ కె.రాజ్‌కిరణ్ అన్నారు. చిలకపాలేంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో మేధా సంపత్తి హక్కులపై సెమినార్ గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహేంద్ర ఫైనాన్స్ కార్యాలయంలో రక్తదాన శిబిరం గురువారం జరిగింది. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఫైనాన్స్ మేనేజర్ ఎ.బాలకృష్ణలు ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రధానం చేశారు. కార్యక్రమంలో జి.కృష్ణ, కె.లక్ష్మణ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్స్, ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, పి.చైతన్యకుమార్, పి.సుజాత, జగదీష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన ఘన జీవామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు గురువారం శిక్షణ ఇచ్చారు. ఎచ్చెర్ల జిల్లా సాంకేతిక శిక్షణ కేంద్రంలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నారు. నాలుగో రోజు క్షేత్ర పరిశీలనలో భాగంగా ఘన జీవామృతం తయారీపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా రైతు సాధికార సంస్థ ప్రాజెక్టు మేనేజర్ పి.రేవతి, అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ధనుంజయరావు పాల్గొన్నారు.

అంతిమయాత్రకు అష్టకష్టాలు

- శ్మశానవాటికలకు రహదారుల కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నెలివాడలో శ్మశానవాటికకు రహదారి లేకపోవడంతో పొలాల్లో నుంచి తీసుకెళ్తున్న దృశ్యం(ఫైల్)

రణస్థలం: కుల, మత, పేద, ధనిక తేడా లేకుండా అందరూ జీవం పోయిన తర్వాత చేరే స్వర్గధామానికి రహదారి సౌకర్యాలు లేకపోవడంతో అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారు 50కి పైగా గ్రామాల ప్రజలకు శ్మశానవాటికలకు వెళ్లే రహదారులు లేవు. పంటలు పండే సీజన్లలో వరి పొలాలను తొక్కుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి ఉంది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అఖరి మజిలీకి అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోకవర్గంలోని రణస్థలం, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల మండలాల్లోని 134 పంచాయతీలో సుమారు 50కి పైగా గ్రామాల్లో శ్మశానవాటికకు వెళ్లే రహదారులు లేవు. ప్రధానంగా ఈ నాలుగు మండలాల్లోని కోష్ట, పతివాడపాలెం, నెలివాడ, తెప్పలవలస, లావేరు, తాళ్లవలస, ఇజ్జాడపాలెం, మురపాక, పరీధుపేట, రామజోగిపేట, తమ్మినాయుడుపేట, డి.మత్స్యలేశం, బడివానిపేటతో పాటు మరికొన్ని గ్రామాల ప్రజలకు ఈ ఇబ్బందులు తప్పడం లేదు.

నిధులున్నా.. ఫలితం శూన్యం

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్మశానవాటికలకు రహదారి నిర్మాణాలకు, స్వర్గధామ భవన నిర్మాణాలకు, చేతిపంపు బోర్లకు నిధులు పుష్కలంగా ఉన్నాయి. అయితే ప్రధానంగా ఈ రహదారులు లేని గ్రామాల్లోని రైతులను ఆయా పొలాల వెంబడి రహదారులు నిర్మించేందుకు ఒప్పించే ప్రయత్నం కూడా జరగడం లేదని విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. సమస్య వచ్చినప్పుడు అప్పటికప్పుడు ఏవో తాత్కాలిక చర్యలు తీసుకుని వదిలేస్తున్నారు తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రభుత్వ సహకారం అవసరం



నియోజకవర్గ వ్యాప్తంగా చాలా గ్రామాలకు శ్మశానవాటికలకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అటువంటి గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ పెద్దలతో సమావేశమై మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాల్సి ఉంది. అందుకు ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తే గ్రామాల్లోని శ్మశాన రహదారులు, బోర్లు వేయడానికి మార్గం సుగమం అవుతుంది.

– పిన్నింటి సాయికుమార్, ఎంపీపీ ప్రతినిధి, రణస్థలం

స్థల సమస్యే ప్రధాన కారణం



చాలా గ్రామాల్లోని శ్మశానవాటికలకు స్థల సమస్యే ప్రధాన కారణం. పంచాయతీ సర్పంచ్‌లు, పెద్దలు సమన్వయంతో మౌలిక వసతులు కల్పించవచ్చును. మండల పరిషత్ నిధుల ద్వారా కూడా బోర్లు వేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– ఎంపీడీవో ఈశ్వరరావు, రణస్థలం

సమస్యలు పరిష్కరించాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అనుబంధ సంఘం గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.అప్పలరాజు కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టి, అనంతరం కమిషనర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ.29,200 అమలు చేయాలని, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు అమలు చేయాలని, విధి నిర్వహణలో ప్రమాదశాత్తు మరణించిన కార్మిక కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అలాగే నాన్ టెక్నికల్ వర్కర్స్‌కు రూ.24,500 కనీస వేతనం ఇవ్వాలన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్యామలరావు, ఆర్.సతీష్ కుమార్, నాయకులు కె.కిషోర్, డి.రామారావు, రాజేశ్వరి, జయశ్రీ, కరుణ, మాధురి, లత, ఎం.శ్రీను, చంటి మున్సిపల్ శానిటరీ మేస్త్రీల సంఘం నుంచి ముద్దాడ రామారావు, షణ్ముఖరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, తారక, రామచంద్ర, గణేష్, సురేష్, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలి

- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశం



ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ రద్దీ సమస్యలపై జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆరా తీశారు. గురువారం సాయంత్రం డే అండ్ నైట్ జంక్షన్, రామలక్ష్మణ జంక్షన్, ఏడు రోడ్ల కూడలి, అరసవల్లి మిల్లు జంక్షన్‌తో పాటు, శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో నలువైపులా విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. పట్టణంలోకి వచ్చి, వెళ్లే వాహనాల రాకపోకలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను తెలుసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, లైసెన్స్ లేనివారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. ఆయనతో పాటు రూరల్ సర్కిల్ సీఐ పైడిపునాయుడు, ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎస్ఐలు హరికృష్ణ, సంతోష్‌లు ఉన్నారు.

దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోళ్లు

- మంత్రి నాదెండ్ల మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

మహారాణిపేట: రైతుల వద్ద నుంచి దళారుల ప్రమేయం లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్రలోని జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లయ్, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులతో జరిగిన ప్రాంతీయ సదస్సులో వివిధ అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ అత్యంత సజావుగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, సాంకేతిక సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. బుకింగ్ దగ్గర నుంచి కొనుగోలు ముగిసే వరకు రైతులకు ప్రతీ విషయం తెలియపరచాలన్నారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ వీర పాండ్యియన్, ఎండీ మంజిల్ జిలానీ, శ్రీకాకుళం జేసీ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు



ఎచ్చెర్ల క్యాంపస్: సమావేశంలో మాట్లాడుతున్న డీటీ గోపాల్

గార: మండలంలోని భూ రికార్డుల సమస్యల పరిష్కారానికి శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎస్.రమణారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీన తోనంగి, 7న కొత్తూరు- షైరిగాం, 9, 10న శ్రీకూర్మం-1, 11న అంపోలు-1, 12న అంబళ్లవలస, 13న బూరవెల్లి, 16న శాలిహుండం, 17న జల్లువలస, 18న వమరవల్లి, 19న కళింగపట్నం, 20న కొర్ని, 21న కొర్లాం, 23న తూలుగు, 24న జాఫ్రాబాద్, 26న నిజామాబాద్, 27న సతివాడ, 28న రాఘవాపురం, 30, 31న సీతారాంపురం (కె.షైరిగాం), జనవరి 2న రామచంద్రాపురం, 3న గొంటి, 4న దీపావళి, 6న వాడాడ, 7న వత్సవలస, 8న గార మండల కేంద్రంలో సదస్సులు ఉంటాయన్నారు.

జి.సిగడాం: రైతుల సమస్యల పరిష్కారానికి గ్రామాల్లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. దీనిలో భాగంగా 6న వాండ్రంగి, 9న మెట్టవలస, మధ్రివలస, 10న జగన్నాథవలస, ఎందువపేట, 11న పున్నాం, 12న డీఆర్‌వలస, సంతవురిటి, 13న నడిమివలస, ఎస్పీఆర్‌పురం, 16న బాతువ, 17న దేవరవలస, 18న నిద్దాం, 19న పెంట, నాగులవలస, 20న గెడ్డకంచరాం, 21 సర్వేశ్వరపురం, ఉల్లివలస, 23న చెట్టుపొదిలాం, గొబ్బూరు, 24న పెనసాం, సేతుభీమవరం, 26న ఆనందపురం, అబోతులపేట, 27న పాలఖండ్యాం, జగన్నాథపురం, 28న సీతారాంపురం, ఎస్‌జీఆర్‌పురం, 30న టీడీవలస, 31న నక్కపేట, గేదెలపేట, 2న వెంకయ్యపేట, మునినివలస, నాయుడు వలస, 3న జాడ, 4న ముడుపాం, కప్పరాం, 6న వెలగాడ, చంద్రయ్యపేట, 4న ఎందువ, నర్సింహపురం, 8న జి.సిగడాం, గంగన్నదొరపాలెం గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తామన్నారు. ఈ సదస్సులను ఆయా రెవెన్యూ పరిధిలో ఉన్న రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఎచ్చెర్ల క్యాంపస్: భూ యజమానుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వీకరించాలని ఎచ్చెర్ల డిప్యూటీ తహసీల్దార్ గోపాల్ అన్నారు. ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులపై సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. గ్రామాల్లో రైతులు నుంచి వినతులు స్వీకరించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. సమావేశంలో ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గార: మండలంలోని తూలుగు సబ్‌స్టేషన్ పరిధి 11 కేవీ విద్యుత్ లైనులో మరమ్మతుల కారణంగా బూరవెల్లి, అంబళ్లవలస, ఆమదాలపాడు, కొర్ని, కొర్లాం, తూలుగు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రణస్థలం: మండలంలోని రణస్థలం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలైన కమ్మసిగడాం, వెల్లురాయి, దేవరాపల్లి, అర్జునవలస, అలాగే సంచాం ఫీడర్ పరిధిలోని గ్రామాలైన సంచాం, పున్నానపాలెం, తిరుపతిపాలెం, బంటుపల్లి, నగరపాలెం, బండిపాలెం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ పి.యోగేశ్వరరావు ఒక ప్రకటన తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కేంద్రం, ఎస్ఎంపురంలోని అనమిత్ర టౌన్‌షిప్, ఏపీ గురుకుల పాఠశాల ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కోత ఉంటుందన్నారు.

ఉత్తమ ఫలితాలను సాధించాలి

జి.సిగడాం: పది, ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించే దిశగా ఉపాధ్యాయులు పని చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు సూచించారు. స్థానిక మోడల్ విద్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 7న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, విద్యార్థుల ప్రోగ్రెస్ వివరించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు భూపతి అర్జున్‌సాయి, ఎంఈవో అరసాడ రవి, ఎంపీపీ పాఠశాల హెచ్ఎం చీర రాము తదితరులు ఉన్నారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

దొడ్డబళ్లాపురం (బెంగళూరు): రైలు ఢీకొని వలస కార్మికుడు మృతిచెందాడు. కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురం పట్టణ పరిధిలో చోటుచేసుకుంది. శ్రీకాకుళానికి చెందిన ప్రవీణ్ (32) దొడ్డ తాలూకాలోని బాశెట్టిహళ్లి పారిశ్రామికవాడలోని ఒక ఫ్యాక్టరీలో పని చేస్తున్నాడు. గురువారం దొడ్డ పట్టణంలోని థియేటర్‌లో పుష్ప-2 సినిమా విడుదలైంది. దీంతో సినిమా చూసేందుకు బాశెట్టిహళ్లి నుంచి దొడ్డ పట్టణానికి వెళ్తూ మార్గమధ్యలో రైల్వే క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతుండగా హఠాత్తుగా రెండు వైపులా రైళ్లు రావడంతో గందరగోళానికి గురై ఓ రైలు కింద చిక్కుకుని మృత్యువాత పడ్డాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

గిరిజన ప్రాంతాల్లో రహదారులకు ప్రతిపాదనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: గిరిజన ప్రాంతాల్లో రహదారి పనులకు ప్రతిపాదనలు తక్షణమే పంపించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై అధికారులతో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. బీటీ రోడ్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల విద్యపై చర్చించారు. స్పోర్ట్స్ స్కూల్‌కు సంబంధించి పూర్తి వివరాలతో డీడీఆర్ పంపించాలని అధికారులను ఆదేశించారు. సికిల్‌సెల్ ఎనీమియాకు సంబంధించి అదనపు డీఎంహెచ్‌ఓను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఏపీఓ జి.చినబాబు, డీడీ ఎం.అన్నాదొర, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి, డీఈఓ తిరుమల చైతన్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, పంచాయతీ రాజ్ ఇంజినీర్లు, ఏటీడబ్ల్యూఓలు ఎం.శ్రీనివాసరావు, ఆర్.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

అధ్వానం



రణస్థలం మండలంలోని తెప్పలవలస నుంచి పాపారావుపేట వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. కనీసం నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేకుండా దమ్ముమడిలా మారిపోయింది. దీంతో విద్యార్థులు, వృద్ధులు తెప్పలవలస రావాలంటే నానా ప్రయాసలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

– రణస్థలం

విరాళం



రిమ్స్‌లోని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యదాన అన్నపూర్ణ సంఘం అన్నప్రసాద వితరణకు రూ.10 వేలు విరాళంగా గురువారం అందించారు. పాత శ్రీకాకుళంకి చెందిన డాక్టర్ లోకనాథం సోమశేఖర్ తన పుట్టిన రోజు సందర్భంగా విరాళం అందజేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు తెలిపారు. రిమ్స్ అన్నపూర్ణ అధ్యక్షుడు గంగుల రమణబాబు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కిల్లాన పల్గుణరావు, లోకనాథం రామారావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

వాహన తనిఖీలు



రాజాం–శ్రీకాకుళం ప్రధాన రహదారిలో సీతంపేట కూడలి వద్ద వాహనాలను గురువారం ఎస్ఐ మధుసూదనరావు ముమ్మరంగా తనిఖీలు చేశారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. అనుమానం వచ్చిన ప్రతీ వాహనాన్ని తప్పనిసరిగా తనిఖీలు చేస్తామన్నారు. వాహనాలు నడిపేవారు రికార్డులు తమ దగ్గర ఉంచుకోవాలని సూచించారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

– జి.సిగడాం

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు



ఎంవీ పద్మావతి, అంబటి శ్రీనివాసరావు



గేదెల పురుషోత్తమరావు



ఎచ్చెర్ల శ్రీధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో గురువారం జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, కళింగ కుల అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, కిల్లి వెంకటసత్యనారాయణ, ఎన్ని ధనుంజయరావు, గేదెల పురుషోత్తమరావు, సాధు వైకుంఠరావు, అంబటి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమేష్, వాన గోపి, ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, బాన్న నర్సింగరావు, ఎచ్చెర్ల శ్రీధర్, కోటిపాత్రుని హరికృష్ణ, రావాడ జోగినాయుడు తదితరులు హాజరయ్యారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో హరిహరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: తల్లిదండ్రులు బాలికల విద్యను ప్రోత్సహించాలని ఎచ్చెర్ల ఎంపీడీవో సీపాన హరిహరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోరి వికాసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యావంతుల ఇళ్లలో సైతం బాల్య వివాహాలు జరుగుతుండడం ఆందోళనకరమన్నారు. బాలికలకు 18 ఏళ్లు దాటాక వివాహం చేయాలని సూచించారు. ప్రతీ బాలికకు రక్త పరీక్షలు నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలన్నారు. రక్త హీనత మహిళల్లో ప్రధాన సమస్యగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐసీడీఎస్ పీవో పాపినాయుడు, వైద్యాధికారి ఉషారాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అరుణకుమారి పాల్గొన్నారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్ కుమార్ అన్నారు. ఎచ్చెర్ల మండలంలోని సంతసీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలు వలన కలిగే నష్టాలు, బాలికలపై దాడులు, పోలీస్ కేసులపై గురువారం అవగాహన కల్పించారు.